# ఉద్యోగ పర్వంలో కల్యాణి

"శర్మ"

ప్రసాదరావు మొదట్లో ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి నుంచి ఆర్డరు రాగానే వుద్యోగం దొరికింది గదా అని సంతోషించాడు. సిగరెట్టు బీడీలకయినా దమ్మిడీ సంపాదన వచ్చే మార్గం లేక పోరంబోకల్లే తిరిగే కన్న నాలుగు జీతంరాళ్ళు స్వశక్తితో సంపాదించి నలుగురిలో యోగ్యుడనిపించుకోటం నిజంగా మహాభాగ్యమే అనుకున్నాడు. తనకు వుద్యోగం ఎపుడెపుడు వస్తుందా అని తపిస్తూ తపస్సుచేస్తూ పుట్టింట్లో మగ్గుతున్న తన అర్థాంగిని తెచ్చి నిక్షేపంగా చీకూ చింతా లేకుండా సుఖంగా జీవయాత్ర చెయ్యొచ్చు అని ఆశ పడ్డాడు. తల్లిదండ్రుల నుంచి చిన్నమాట పడకుండా యిక విముక్తి కలిగింది కదా అని అనుకున్నాడు.

కాని తీరా వెళ్ళి వుద్యోగంలో జాయిన్ అయ్యేసరికి, ఆశలు, ఆపోహలు, కలలు ఒట్టి భ్రమలూ భ్రాంతీ అయినాయి. ఇంత బేవార్సు వుద్యోగం యింకోటి వుండబోదని అభిప్రాయపడ్డాడు. తీరా కలవరించి పలవరించి పరితపించి యీ నరకంలో పడ్డామేమిరా బాబూ అని చింతించాడు. కాని మొత్తమ్మీద తనకు తగ్గ వుద్యోగం కాదనే నిశ్చయం కలిగింది. ప్రసాదరావు ఆ గ్రామ రెవిన్యూ ఆఫీసులో క్లర్కు. అసలు ఆ ఆఫీసే చిన్నది కావటంచేత యిద్దరు ముగ్గురు జనాభా కంటే ఎక్కువ వుండదు. ఒక టైపిస్టు, ఇద్దరు క్లర్కులు, ఒక హెడ్డు క్లర్కు — యిదే ఆఫీసు బలగం అంతా. అన్నట్టు ఒక జవాన్.

ఇపుడు గోల అంతా ఆ హెడ్డు క్లర్కు గారితోనే వచ్చింది. చావు అంతా ఆయనతోనే వుంది. ఆయన పేరు జనార్దనరావు. జనార్దనరావు పేరుమాట ఎట్లావున్నా ఆయన మటుకు ఆఫీసులో వాళ్ళని మర్దనచేసి వదిలిపెడుతున్నాడు. ఆదేంపాపమో కాని ఆయన ప్రకృతి అందరిమల్లేనే వుండదు. వాలకం, వైఖరి కూడా అల్లాగే వుంటుంది. జనార్దనరావు ఒట్టి అనుమానపు మనిషి అని ఆ జానపదులు చెప్పేమాట. మొమ్మాటికీ అంతేకూడ. ఆయన చేసేపనులు అన్నీ పరిహాసాస్పదంగానే వుంటాయి. మళ్ళీ ఎవరు తన్ను చూసి నవ్వి పోతారో అని న్యూనత. ఇది ఎట్లా కుదురుతుంది? ఆయనే కో చేస్తూనే వుంటాడు. వాళ్ళంతా నవ్వుతూనే వుంటారు.

జనార్దనరావు ఎంత అనుమానపు మనిషి అంటే రెండు రెళ్లు నాలుగేనా అని సంశయించే లెఖ్ఖలో మనిషి. జీవితాన్ని కొన్ని వైపరీత్య వికృత సమస్యలు పట్టుకోనేకూడదు. పట్టుకుంటే యావజ్జీవమూ పీడించి గుండెల్ని పిండేస్తాయి. మనశ్శాంతి సంతుష్టులను కరువు చేస్తాయి. ఇరవైనాలుగు గంటలూ అడ్డుదారి సమస్యలతో మనస్సును హైరాన పెట్టుకుంటారు. చివరకు పాపం ఆ మానవ మాత్రులు.

ఆ గ్రామంలో రెవిన్యూ పనులు చాలా తక్కువ. ఎంత ఎక్కువ వచ్చినా రోజుకి పది పదిహేను కాగితాల కంటె ఎక్కువ రావు. ఒక కాగితం చూడడానికి కనీసం రెండు గంటలు పడుతుంది. "ప్రసాదరావుగారూ! ఇక్కడ లెఖ్ఖ సరిపోయిందో లేదో చూడండి యింకోసారి. ఎందుకయినా మంచిది" ఇదే వరస ప్రతి కాగితానికీ. "అబ్బే అక్కర లేదండి" అంటే "అహహా! ఎందుకయినా మంచిది, తర్వాత పస్తా యిస్తే ప్రయోజనం వుండదు. చూడండీ." ఎదురు మేకులు యిట్లా వుంటాయి. పోనీ చూసి ఒక పావుగంట ఆగి యిస్తే కాగితంవంక ఎగా దిగా ఒక అరగంట చూసి, "నరహరిరావుగారూ! మన ప్రసాదం

గారు ఇక్కడ ఏదో లెఖ్ఖ వేశారు. మీరు కూడా ఒకసారి చూడండి" అని యివ్వటం, ఆయన చూసి యివ్వంగానే "మళ్ళీ చూశారా" అని అడుగుతాడు. చివరికి అక్కడికి తెగింపు అయిన తర్వాత "నరసింహారావుగారూ! ఈ కాగితం చూడండి" అని ఆయనకు చూపిస్తాడు. ఆయనా అయిన తర్వాత మళ్ళీ ఒక అరగంట వేస్టు. చివరకు ఆ కాగితంమీద సంతకం పడే సరికి అక్కడ పనిమీద వచ్చిన పెద్దమనిషికీ, ఆఫీసు క్లర్కుకూ ప్రాణాలు మచ్చమాస్తాయి. ఈ విధంగా గవర్నమెంటు రూల్సు ప్రకారం అయిదు గుంటలకు ముగియవలసిన ఆఫీసు ఏడు దాకా నడుస్తుంది.

జనార్దనరావు గుమాస్తాలను వేపుకుతినటం యింతా అంతా గాదు. పొరపాటున నిజంగా తప్పుపని చేస్తే యిహ ప్రాణాలు కొరుక్కు తినటమే. చివరికి ఆ గుమాస్తాకు విసుగెత్తి సెలవు పెడతాడు. అప్పుడు విషయం కొంచెం పాతపడుతుంది. ప్రతి కాగితం ప్రతి గుమాస్తాకు తిరగవలసిందే. చిన్నపిల్లవాడిని అడిగినట్టు "ఏమండీ ప్రసాదంగారూ పదహారు మూళ్లు నలభై ఎనిమిదేగా" అని అడుగుతాడు. ఎవరయినా సెలవు పెడితే యీకకు యీక పీకకు పీకగా ఆరాలు తీసి మచ్చమాపిగాని సెలవు శాంక్షన్ చెయ్యడు. ప్రసాదరావు వుండే గది జనార్దనరావు ఇంటికి సమీపంలో వుంది. అందువల్ల ఆఫీసునుంచి వస్తూ పోతున్నా, వేరే పనులమీద గ్రామంలోకి వెళ్ళవలసి వచ్చినా వాళ్ళ యింటి ముందు నించి వెళ్ళటంకద్దు. ప్రసాదరావు యింకా భార్యని కాపరానికి తీసికొనిరాలా. ప్రసాదరావు ప్రకృతి చాల వింత అని గ్రామంవాళ్ళే అంటారు. ఎవరితోనూ అనవసరంగా పూసుకొని మాట్లాడడు. ఒక వేళ ఖర్మంజాలక మాట్లాడవలసి వచ్చినా ముఖ్యంగా మూడు ముక్కల్లో ముక్త సరిగా ముగించి తప్పుకు వెళ్ళే మనిషి.

జనార్దనరావు యింట్లోలేని సమయంలో ప్రసాదరావుని హఠాత్తుగా దోవని వెడుతూంటే ఆపింది కల్యాణి. "ఏమండీ మీభార్య కాపరానికి రాలేదా? అసలు పెళ్ళి ఐందా" అనడిగింది. ప్రసాదరావు "అయిందండీ! ఇంకా కాపరానికి రాలేదు." అని తల వంచుకొని వెళ్ళిపోతున్నాడు. ఒక్క మాటండీ! మావారు ఆఫీసులో సరిగా వుంటారా? వెర్రిమొర్రిచేష్టలు చేస్తారా?" అని తిరగ ప్రశ్న వేసింది. "ఎబ్బే! అటువంటివి లేవండి! త్వరగా వెళ్ళాలి. వెళ్ళి వస్తా!" అని ఒదిలించుకొని వెళ్లాడు. సరిగ్గా ఆ సమయానికి జనార్దనరావు మలుపు తిరిగి రావటం జరిగింది. మలుపు తిరుగుతూన్నప్పుడు ప్రసాదరావు కళ్ళూ జనార్దనరావు కళ్ళూ కలిశాయి. వాకిట్లోకి రాగానే గిలకవలె నుంచున్న భార్యనుచూసి నోట్లో చుట్ట అవతల పారేసి "లోపలికి పో!" అని కసిరాడు. "మీకంతా అనుమానమేనండి" అని గలగల గాజులతో లోపలికి గిరుక్కుమని వెళ్ళింది.

జనార్దనరావుకు అనుమాన పిశాచం బాగా నరనరంలో పట్టుకుంది. సరిగ్గా వాకిట్లో సొగసుగా అలంకరించుకొని మితారివలె నుంచోటం మలుపు తిరగంగానే ప్రసాదరావు ఎదురవటం ఆ శంకకు దోహదం యిచ్చి అనుమానానికి స్థానం కల్పించాయి. ఇంట్లోకి వచ్చి "నీకు వాకిళ్ళలో ఏంపని? మొగవాళ్లు తిరిగే తావు గదా! అసలే రౌడీ పోజులు దొంగచూపులుకు పెట్టింది పేరు. ఆడదానివి కదా, జ్ఞానం వుండక్కరలా" అని ఝుమాయించి ఛడామడా అక్కసు కక్కాడు. "ఊరుకోండి ఎవరన్నా వింటే నవ్విపోతారు మన తెలివితేటలకి" అని నోరు మూసింది. ఆ రాత్రల్లా జనార్దనరావు అనుమానపు వికృత ఆలోచనల మంటల్లో కాలిపోయినాడు. మనస్సులో అప్రశుతి భావాలు విజృంభించినాయి. గుండెల్లో కణకణలాడే నిప్పులు పోసినట్లయింది.

మర్నాడు భోజనంపెడుతే "ప్రసాదరావుగారు బాగా పని చేస్తారండీ ఆఫీసులో?" అని జనార్దనాన్ని కల్యాణి అడిగింది. దీంతో లోపల అనుమానం ధృవపడింది. "వాడు ఎట్లా చస్తే యేం చెప్పు? ఈసారి వాడి మాట ఎత్తాలి చెపుతా" అని తోకతొక్కిన నాగువలె అరిచాడు. "చాల్లెండి ఎవరన్నా వింటే నవ్విపోతారు" అని తాళంవేసింది నోటికి.

ఆ రోజున ప్రసాదరావు సెలవు పెట్టాడు,

తలకాయ నొప్పిగావుందని. ఆఫీసుకు వచ్చిన తర్వాత జనార్దనరావు తెలుసుకొని ప్యూన్‌ని పిలిచి "ఒరేయ్ ఆయనని అర్జంటుగా పిలుచుకొని రారా" అని కాగితం వ్రాసి పంపాడు. లోపల మనస్సు కల్యాణికీ ప్రసాదరావుకూ సంబంధం కల్పించి నానా హంగామాచేసి హత మారుస్తోంది. నిన్న సాయంకాలంవరకు రాయల్లె ఏరోగం నొప్పి ఎరుగని మనిషికి తెల్లారేప్పటికి తలకాయనొప్పి ముంచుకురావటం దొంగవేషం అనిపించింది. ఏదో లేవతీసుకు పోవటానికి గోతులు త్రవ్వుతున్నాడు అని మనస్సు చెపుతున్నట్లుంది. ఈలోగా ప్యూన్ వచ్చి "నిజంగానే తల నొప్పిగా వుందిటండీ. పడుకొన్నారు" అన్నాడు. "సరే లే" అని మనస్సులో అనుకున్నాడు.

మధ్యాహ్నం అవుతూంది. ఎండ నిప్పులు చెరుగుతున్నట్లు వుంది. ఆఫీసులో వాళ్ళని పని చేస్తూవుండమని చెప్పి ప్యూన్‌ని తీసికొని గబగబ యింటిదోవ పట్టాడు. ఇంటికొచ్చి కోపంతో బూటుకాలుతో తలుపుతన్నాడు. కాని జవాబు రాలా. దబదబ బాదాడు. కాని మాటాపలుకూ లేదు. 'దీనిదుంపతెగ! టక్కరిదేంఏడుస్తోందో!' అని తలుపు బద్దలు అవుతుందా అన్నట్లు కొట్టాడు. లోపల ఏదో కొంపముంచే పని జరుగుతోందని మనస్సు చేసే ఘోష చెవుల్లో గింగురు మంటోంది. జోరు ఎక్కువయింది. "ఒరే పలుగు పట్రా" అని బంట్రోతును పిలిపించాడు. ఈ చప్పుడుకు, పిడుగుల మోతకు చుట్టుప్రక్కలవాళ్లు చేరారు. ముఖంలో కళ మారింది, రూపు మారింది. మొహం చెమటలు కారుతోంది. బంట్రోతు పలుగు తెచ్చాడు. రోకళ్లు తెచ్చారు, తలుపులు పగులగొట్టారు. అంతా గాలించారు. మనిషిజాడ లేదు. జనార్దనరావుకు సిగ్గు, భయం, సంశయం ముప్పిరిగొన్నాయి. ఈ తఫా "లేవదీసుకుపోయాడు" అని మనస్సు ఘోషిస్తోంది. అనుమానం వుధృతమయింది. "ఎక్కడి పోయినట్టు యీ మనిషి" అని పంచాంగం విప్పాడు. ప్రతివాళ్ళూ ఎక్కడికి పోయిందంటే ఎక్కడికి పోయింది అనేవాళ్లేగాని ఆర్చేవాళ్లు తీర్చేవాళ్లులేరు. జనార్దనరావు పెరటి తలుపు తీసివుండటం చూశాడు. వీళ్లు యిద్దరూ రంగం ఎక్కడో పెట్టారు అనే సంశయం ఎక్కువయింది. కల్యాణి వచ్చి వీధి తలుపులు తీసివుండటం చూసి గాభరాపడింది. వాకిట్లో చుట్టుప్రక్కలవాళ్ళు ఎక్కడికి వెళ్లావమ్మా అంటే ఎక్కడికి వెళ్లావూ అని ప్రశ్నించుతున్నారు. జనార్దనరావు ఆకారం చూసి "అమ్మయ్యో" అంది. "ఎక్కడికి వెళ్ళావో చెప్పు! చంపేస్తా వాడి దగ్గరకేనా, వెళ్ళివచ్చింది? ఆ రాడీ దగ్గరకేనా?" అని చేతిలో గునపం ఎత్తాడు. "అయ్యో లేదండీ. చిన్న షావుకారి భార్య కబురుపంపిస్తే వెళ్ళానండీ" అని గోల. చావుదెబ్బ తప్పింది చెంపలు ఫెడీలుఫెడీలు మన్నాయి కల్యాణికి. ఆ కోపంలో రౌద్రరోషంలో నిజానిజాలు తెలుసుకొనే పరిజ్ఞానం పోయింది. కల్యాణి తన్నులు తింది.

ఆ గ్రామం అంతా కలిపితే ఆరుమైళ్ళ పొడుగు ఏవైపునా లేదు. సాయంకాలానికల్లా వూరంతా గుప్పుమంది. ప్రసాదరావుకు యిదేమీ తెలియదు. వచ్చిన తర్వాత అంతా తెలిసింది. "ఇంత అనుమాన పిశాచమా" అనుకున్నాడు. ఆ గ్రామంలో వుండటం అభిమానానికీ ఆత్మగౌరవానికీ భంగం మాత్రమే కాక ఎపుడో చెప్పుదెబ్బలు తినవలసివస్తుందని తలచాడు. "ఉద్యోగం లేకపోతే పీడాపోయింది యీ దుక్కుమాలిన పీడలు ఎవడు పడతాడు. బ్రతికుంటే వుద్యోగం చేసుకోలేకపోతామా" అని క్లర్కు పోస్టుకి రాజీనామా యిచ్చాడు. "హెడ్డు గుమాస్తా ఒట్టి అనుమానపు మనిషి అనీ తనకూ తన భార్యకూ రంకులు కట్టాడనీ" రాజీనామా లేఖలో వ్రాశాడు.

కొన్నాళ్ళ తర్వాత నిజంగానే కల్యాణి ఎవర్నో తీసుకుని లేచిపోయింది.

భూమికి ఆకర్షణశక్తి అనే గుణం ఉన్నన్నాళ్లూ విమాన ప్రయాణం మానుకోవడం మంచిదనే భయస్తులు కూడా లేకపోలేదు మనలో!